# ఎన్నికల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రవర్తనా నియమావళి అమలుపై నిరంతరం పటిష్ట పర్యవేక్షణ ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఎన్నికల విధుల కేటాయింపు కోసం జిల్లా ట్రెజరీ అధికారి కార్యాలయం నుంచి ప్రభుత్వ సిబ్బంది డేటా తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులు ఎంతో ప్రధానమైందని, ఎవరికీ మినహాయింపు లేదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి డిసెంబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. 24 గంటలూ పర్యవేక్షణ చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లు, ఫొటోలను, ఫ్లెక్సీలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. సెక్టోరియల్ అధికారులు వారి పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులను కల్పించాలని సూచించారు. ఎక్కడైనా లోటుపాట్లుంటే తక్షణమే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, వీల్‌చైర్లు, మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్డి కచ్చితంగా ఉండాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌వో రవీంద్రనాథ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ నోడల్ అధికారులు, జడ్పీ సీఈవో విద్యాలత, అన్నిశాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

### పనుల ప్రగతిపై నివేదికలు అందజేయాలి

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 16 : పనుల పురోగతిపై అధికారులు నివేదికలు అందజేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజావాణి, ఇంజినీరింగ్ పనులు పురోగతి, ఐడీవోసీ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు, అంగన్‌వాడీ కేంద్రాల్లో రెయిన్ హార్వెస్టింగ్, స్ట్రక్చర్స్ తదితర అంశాలపై అన్నిశాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి, తగుచర్యల నిమిత్తం ఆయాశాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. గ్రౌండింగ్ చేసి జరుగుతున్న పనులపై మాత్రమే నివేదికలు అందజేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నూతనంగా ఎలాంటి పనులు చేపట్టడానికి అనుమతిలేదన్నారు. పూర్తిచేసిన పనులను ఎంబీలో నమోదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌వో రవీంద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌డేలో విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

# అమ్మవారి మండపాల్లో హోమ పూజలు

పాల్వంచ, అక్టోబర్ 16 : శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాల్వంచ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద సోమవారం అత్యంత వైభవోపేతంగా హోమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్, గట్టాయిగూడెం, నవభారత్, శాస్త్రీరోడ్, కేటీపీఎస్, సీ కాలనీ, సంజయ్‌నగర్, గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద పూజలు నిర్వహించి అన్నదానాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


పాల్వంచరూరల్ : గాయత్రీదేవి రూపంలో..


పాల్వంచ : గాంధీనగర్‌లో హోమం

### స్వర్ణదుర్గా ఆలయంలో..

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 16 : కొత్తగూడెం పట్టణం ఎంజీరోడ్‌లోని శ్రీ విజయవిఘ్నేశ్వర స్వామి ఆలయంలో ఉన్న స్వర్ణదుర్గాదేవీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా రెండోరోజు సోమవారం హోమ పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలతో తీర్థపు బిందు, నిత్యార్చన, పంచామృత స్నపనము, పీఠార్చన, చండీసప్తశతీ హోమం, కుంకుమార్చన, చక్ర నవావరణార్చన, చండీ సప్తశతీ పారాయణ, దుర్గా, లక్ష్మి, బాల అనుష్టానములు, పీఠపూజ తదితర పూజలు జరిగాయి. అమ్మవారు మధురమీనాక్షీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

### పెద్దమ్మగుడిలో..

పాల్వంచ రూరల్, అక్టోబర్ 16 : శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో రెండోరోజు సోమవారం వైభవంగా ఉత్సవాలు జరిగాయి. అర్చకులు ప్రాత:కాలార్చన, శ్రీలక్ష్మి గణపతి అనుష్టానములు, నవగ్రహ జపములు, ద్రుమోమం, రుద్రాభిషేకం జరిపారు. ఉదయం బాలపూజలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం చండీహోమం లక్ష కుంకుమార్చన యాగశాలలో జరిపారు. భక్తులకు అమ్మవారు గాయత్రీదేవి రూపంలో దర్శనమిచ్చారు. సాయంత్రం కళావేదికలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో రజనీకుమారి, కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

### కుంకుమ పూజలు..

చుంచుపల్లి, అక్టోబర్ 16 : మండలంలోని గౌతంపూర్‌లో ఉన్న శ్రీ కనక దుర్గ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమపూజల్లో పాల్గొన్నారు. శివుడికి అభిషేకాలు నిర్వహించారు. విద్యుత్‌దీపాలతో ఆలయాన్ని అలంకరించారు.


చుంచుపల్లి : బాలాత్రిపుర సుందరీదేవి

# మైనింగ్‌రంగంలో సవాళ్లను అధిగమించాలి

## ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 16 : దేశంలో మైనింగ్‌రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను ఇంజినీర్లు అవకాశాలుగా మార్చుకొని అధిగమించాలని, తద్వారా దేశ జీడీపీ ఎదుగుదలకు సహకరించాలని ఎన్‌ఎండీసీ చైర్మన్ అండ్ ఎండీ అమితవ ముఖర్జీ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఎండీసీ సమావేశ మందిరంలో జరిగిన మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. దేశంలో గుర్తించబడిన మైనింగ్ నిలువలు 22శాతం ఉండగా వీటిలో సమగ్ర అన్వేషణ జరిగినవి కేవలం 6శాతం మాత్రమేనని, వీటిలో ప్రస్తుతం మైనింగ్ జరుగుతుందని, రెండుశాతం మాత్రమేనని పేర్కొన్నారు. దేశాభివృద్ధి దిశగా ముందుకు దూసుకెళ్లగా ఈ తరుణంలో ఈ రెండు శాతాన్ని రెట్టింపు చేస్తే జీడీపీకి మైనింగ్ రంగం నుంచి నాలుగుశాతం వృద్ధి చేకూరుతుందన్నారు. మైనింగ్‌రంగాన్ని మరింత అభివృద్ధిపర్చాల్సిన బాధ్యత ఇంజినీర్లపై ఉందని పేర్కొన్నారు. సమావేశంలో అసోసియేషన్ జాతీయస్థాయి మాజీ అధ్యక్షుడు ఎండీ షఫీయుద్దీన్, వీడీ రాజగోపాల్, ఎంఈఏఐ సెక్రటరీ జనరల్ నరసయ్య, హైదరాబాద్ చాప్టర్ మాజీ అధ్యక్షుడు బీఆర్‌వీ సుశీల్‌కుమార్, ఎన్‌ఎండీసీ డైరెక్టర్ టెక్నికల్ వినయ్‌కుమార్, డైరెక్టర్ కమర్షియల్ విశ్వనాథ్ సురేష్, డైరెక్టర్ ప్రొడెక్షన్, దిలీప్‌కుమార్ మహంతి, కొత్త కమిటీ చైర్మన్‌గా వినయ్‌కుమార్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈఏఐ ప్రతినిధులు

# జిల్లాలో భారీగా నగదు పట్టివేత

- రూ.60.78 లక్షలు స్వాధీనం


జిల్లాలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 16 : ఎన్నికల కోడ్ నిబంధనలు అతిక్రమించి సరైన ధ్రువపత్రాలు లేకుండా రవాణా చేస్తున్న భారీ నగదుని జిల్లా పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. జిల్లాకేంద్రమైన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించి రూ.13 లక్షలు సీజ్ చేశారు. అదేవిధంగా ఇల్లెందు పోలీసులు రూ.17 లక్షలు, చంద్రుగొండ పోలీసులు రూ.13.40 లక్షలు, అన్నపురెడ్డిపల్లి పోలీసులు 2.88 లక్షలు, చుంచుపల్లి పోలీసులు రూ.6 లక్షలు, అశ్వాపురం పోలీసులు రూ.2 లక్షలు, దమ్మపేట పోలీసులు రూ.3.5 లక్షలు, అశ్వారావుపేట పోలీసులు రూ.లక్ష మొత్తం రూ.60,78,780 నగదు సీజ్ చేసినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సరైన ధ్రువపత్రాలు లేకుండా ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు రవాణా చేస్తే చర్యలు తప్పవని పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం


విశ్రాంత ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

జూలూరుపాడు, అక్టోబర్ 16 : మండల కేంద్రంలోని జూలూరుపాడు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ 25 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెండ్యాల నరేశ్, కొలిపాక సురేశ్, సతీశ్, నరేశ్, షేక్ కరీముల్లా, నర్సింహారావు పాల్గొన్నారు.

# బెంచ్‌ప్రెస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌కి గోల్డ్‌మెడల్

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 16 : ఐదు జిల్లాలవారీగా నిర్వహించిన బెంచ్‌ప్రెస్ పోటీల్లో కొత్తగూడెం త్రీ టౌన్ హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన్ని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, ఇల్లెందు డీఎస్పీ కేవీ రమణ మూర్తి, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఒడ్డేపల్లి మురళి అభినందించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో ఐదుజిల్లాల స్థాయిలో బెంచ్‌ప్రెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 104 కేటగిరీలో 90కిలోల మాస్టర్స్ విజేతగా కొత్తగూడెం త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఖాదర్ అలీ గోల్డ్‌మెడల్ సాధించారు.


ఖాదర్‌ని అభినందిస్తున్న డీఎస్పీలు రెహమాన్, రమణమూర్తి

# డైరెక్టర్ బలరామ్‌కు పరామర్శ

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 16 : సింగరేణి డైరెక్టర్(పా, ఫైనాన్స్) ఎన్.బలరాం తండ్రి హనుమంతునాయక్ ఆదివారం మృతిచెందారు. ఈ సందర్భంగా సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం బలరాంను కలిసి పరామర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా తిరుమలగిరి గ్రామంలో ఉన్న డైరెక్టర్(పా) స్వగృహానికి వెళ్లి హనుమంతు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డైరెక్టర్(పా) బలరాంతోపాటు ఆయన కుటుంబ సభ్యులందరినీ ఓదార్చి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో రిటైర్డ్ జీఎం ఏ.ఆనందరావు, సంక్షేమ సంఘం నాయకులు ఆంతోటి నాగేశ్వరరావు, పంతులు, భూక్యా నాగేశ్వరరావు, భాస్కర్‌రావు, సుమన్, రాజ్‌కుమాదవ్ యాదవ్ ఉన్నారు.